www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 30 జూన్ 2024

## నేడు అంతర్జాతీయ నిపుణుల బృందం పోలవరం రాక

### పనులను 4 రోజులు పరిశీలించనున్న నిపుణులు

ప్రజాశక్తి - పోలవరం

అంతర్జాతీయ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టును సందర్శించనుంది. ఈ బృందం ఆదివారం ఉదయం 9:45 నిమిషాలకు ప్రాజెక్టు గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. నాలుగు రోజులపాటు పోలవరం ప్రాజెక్టును పరిశీలించి ప్రాజెక్టు నిర్మాణంలో ఎగువ, దిగువ కాపర్ డ్యాముల సీపేజీ, ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎదురవుతున్న అవాంతరాలు, డయాఫ్రమ్ వాల్ పునర్నిర్మాణం తదితర అంశాలపై పరిశీలించనున్నారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టర్‌తో సమీక్ష నిర్వహించనున్నారు.

# ఖాకీల కష్టం తీరేదెప్పుడో..!

**ఈ ప్రభుత్వంలోనైనా పోలీసుల కష్టాలు తీరేనా అంటూ ఆ శాఖలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. గత ప్రభుత్వం పోలీస్ శాఖను తీవ్ర నిర్లక్ష్యం చేయడంతోపాటు వారికి అందాల్సిన సొమ్మును సైతం అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. పోలీసులకు వీక్లీఆఫ్ అమలును ఆర్భాటంగా ప్రారంభించి ఏడాది గడవకముందే తిలోదకాలు ఇచ్చేసింది. దీంతో ఈ ప్రభుత్వమైనా పోలీస్ సిబ్బందికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది.**

**పోలీసులకు వీక్లీఆఫ్ అమలుపై టిడిపి కూటమి హామీ**
**విజయవాడలో టర్మ్ విధులతో పోలీస్ సిబ్బంది నరకం**
**పని భారం పెరిగి అనారోగ్య సమస్యలు తీవ్రం**
**టిఎ, ఎస్ఎల్ఎస్ సొమ్ము సైతం సకాలంలో ఇవ్వని పరిస్థితి**
**ఈ ప్రభుత్వంలోనైనా పోలీసులకు ఊరట లభించేనా?**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో అత్యంత దారుణంగా విమర్శలు ఎదుర్కొన్న శాఖల్లో పోలీస్‌శాఖ ఒకటి. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలను మూటగట్టుకుంది. అయితే గత ప్రభుత్వం పోలీస్‌శాఖకు మాత్రం చేసిందేమీ లేకుండాపోయిందని చెప్పొచ్చు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సిఐ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకూ దాదాపు మూడు వేల మంది వరకూ ఉన్నారు. ఒక్క ఈ జిల్లాలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గత ప్రభుత్వం వీక్లీఆఫ్ అమలుపై చేతులెత్తేయడంతో సిబ్బందికి కుటుంబంతో గడిపే సమయం లేకుండాపోయింది. గడిచిన ఎన్నికల్లో భాగంగా తాము అధికారంలోకి వస్తే పోలీసులకు వీక్లీఆఫ్ అమలు చేస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చింది. ఈ హామీకి ఆర్థికంగా నిధులు వెచ్చించాల్సిన అవసరం లేదు. కాబట్టి వీక్లీఆఫ్ హామీ అమలు కోసం పోలీస్ సిబ్బంది ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో విజయవాడలో టర్మ్ విధుల పేరుతో ప్రతి స్టేషన్ నుంచి నెలకు ఒక కానిస్టేబుల్‌కు విధులు కేటాయిస్తూ వస్తున్నారు. ప్రతి నెలా జిల్లా నుంచి నలుగురైదుగురు కానిస్టేబుళ్లు తాడేపల్లి, విజయవాడ ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తోంది. ఈ విధులు నెలలో 15 రోజులు ఉంటాయి. టర్మ్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి అక్కడ విశ్రాంతి తీసుకోవడానికి, రాత్రి ఉండటానికి ఎటువంటి వసతులూ లేవు. దీంతో డార్మెటరీలో ఉండాల్సి వస్తోంది. దీంతో 15 రోజులకు తక్కువగా లెక్కించినా రూ.నాలుగు నుంచి రూ.ఐదు వేలు ఖర్చువుతోంది. చేతి సొమ్ము పెట్టుకుని విధులు నిర్వర్తించాల్సి రావడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. విజయవాడలో వేసే టర్మ్ విధులను రద్దు చేయాలని పోలీస్ సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వీక్లీ ఆఫ్ లేకపోవడం, టర్మ్ విధులు, బందోబస్తులతో విశ్రాంతి లేక పోలీస్ సిబ్బందిలో అనారోగ్య సమస్యలు తీవ్రతరమవుతున్నాయి. కొత్త ప్రభుత్వమైనా తమ మొర ఆలకించి టర్మ్ విధులను రద్దు చేయడంతోపాటు వీక్లీఆఫ్ అమలు చేయాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

**కొత్తగా నియామకాలు లేవు.. చేసిన పనికి బిల్లులివ్వని దుస్థితి**

పోలీసులకు వీక్లీఆఫ్ అమలు చేయాలంటే కొత్తగా కానిస్టేబుళ్ల నియామకం పెద్దఎత్తున జరగాల్సి ఉంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క కానిస్టేబుల్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క నోటిఫికేషన్ కోర్టు మెట్లు ఎక్కి నిలిచిపోయింది. దీంతో ఎంతోమంది వయస్సు దాటిపోయి పోలీస్ ఉద్యోగానికి అర్హత కోల్పోయిన పరిస్థితి ఉంది. పోలీస్‌శాఖలో ఉద్యోగాల భర్తీ జరిగితే తప్ప పోలీస్ సిబ్బంది కష్టాలు తీరే పరిస్థితి కన్పించడం లేదు. ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ ఎప్పుడిస్తుందోనని యువత ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా 24 గంటలు నిద్రాహారాలు వదిలేసి పని చేస్తున్న పోలీస్ సిబ్బందికి ఇవ్వాల్సిన సొమ్ము సైతం గత ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రతినెలా టిఎ రూపంలో నెలకు రూ.2,100 ఇవ్వాల్సి ఉంది. పది నెలలుగా ఇవ్వని పరిస్థితి నెలకొంది. సరెండర్ లీవ్స్‌కు సంబంధించిన సొమ్ము బకాయిలూ ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే పోలీసులను గత ప్రభుత్వం అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసింది. కూటమి ప్రభుత్వమైనా తమ మొర ఆలకించి పోలీసుల సమస్యలను పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు కోరుతున్నారు

# 1న రూ.7 వేలు పెన్షన్

- నూరు శాతం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- 2,68,353 మందికి రూ.182.73 కోట్లు పంపిణీ
- సచివాలయ, ఇతర ఉద్యోగులు మొత్తం 5,365 మంది విధుల్లో
- డయేరియాపై కట్టుదిట్టమైన చర్యలు
- ధాన్యం సొమ్ము అందజేత, గోదావరి వరదలపై ప్రత్యేక దృష్టి
- జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

జులై ఒకటో తేదీన ప్రభుత్వం పెంచిన పింఛన్, మూడు నెలల ఎరియర్స్‌తో మొత్తం రూ.ఏడు వేలు సొమ్ము అందించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని, తొలిరోజునే నూరుశాతం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పింఛన్ల పంపిణీ, డయేరియా ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలతోపాటు వివిధ అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో జులై 1న 2,68,353 మందికి పింఛన్ల పంపిణీ జరుగనుందని, గడిచిన జూన్‌లో పింఛన్ల కింద రూ.80.63 కోట్లు అందజేయగా, ప్రస్తుత ప్రభుత్వం పెంచిన రూ.వెయ్యితోపాటు, ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించి ఎరియర్స్ కింద రూ.మూడు వేలు, మొత్తం రూ.ఏడు వేలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. దీనికి సచివాలయ సిబ్బంది 4,539 మందితోపాటు ఇతర ప్రభుత్వ సిబ్బంది 826 మంది మొత్తం 5,365 మందిని వినియోగించనున్నారు. ఉదయం ఆరు గంటలకే ఇంటింటికీ పింఛన్ సొమ్ము అందజేత ప్రారంభమవుతుందన్నారు. పింఛన్ల విషయంలో ఏదైనా ఇబ్బంది వస్తే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయవచ్చునన్నారు. డయేరియా ప్రబలకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. తాగునీరు, డ్రెయినేజీ నీరు కలిసిపోవడం వల్లే డయేరియా వస్తుందన్నారు. చేతులు కడుక్కోవడం, శుభ్రత పాటించడం, కాచి చల్లార్చిన నీరు తాగడం వంటివి చేయాలన్నారు. పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. డయేరియా లక్షణాలు కన్పిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యం చేయించుకోవాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమం చేపట్టామని, అందుకు సంబంధించి ప్రత్యేక ఫేస్‌బుక్ పేజీని ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం సొమ్ము అందజేత, గోదావరి వరదలకు సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానం ఇస్తూ తనకు రోజూ వస్తున్న ఫోన్‌కాల్స్‌లో ఎక్కువగా ధాన్యం సొమ్ము కోసం రైతుల నుంచి, భూముల సమస్యలపైనే ఉన్నాయన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గోదావరి వరదలకు సంబంధించి ఇప్పటికే అధికారులతో రెండుసార్లు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మూడు నెలలకు సంబంధించి నిత్యావసర సరుకులు సిద్ధం చేసేలా పౌర సరఫరాల శాఖకు ఆదేశాలిచ్చామన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిపిఒ తూతిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'పోలవరం'ను సందర్శించిన ట్రెయినీ ఐఎఎస్‌లు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టును ట్రెయినీ ఐఎఎస్‌ల బృందం శనివారం పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్ 2023-24 సంవత్సరం బ్యాచ్ ట్రెయినీ ఐఎఎస్‌లు ఆరుగురు పోలవరం ప్రాజెక్టుకు చేరుకుని స్పిల్‌వే, హిల్ వ్యూ, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌లు, పవర్ ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించారు. వారికి ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత వివరాలను తెలిపారు. ఈ బృందంలో ట్రెయినీ కలెక్టర్లు సిహెచ్.కళ్యాణి, దామెర హిమవంశీ, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, బొల్లిపల్లి వినూత్న, హెచ్ఎస్.భావన, సుభమ్ నోక్వాల్ ఉన్నారు. వారి వెంట పోలవరం తహశీల్దార్ జివి.ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



పోలవరం ప్రాజెక్టు వద్ద ట్రెయినీ ఐఎఎస్‌లు

**ఏలూరు:** జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఏలూరు చేరుకున్న ఎపి ట్రెయినీ ఐఎఎస్‌లు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్విని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 2023 ఎపి బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ట్రెయినీ ఐఎఎస్‌ల బృందంలో సిహెచ్.కళ్యాణి (కర్నూలు), దామెర హిమవంశీ (చిత్తూరు), పవార్ స్వప్నిల్ జగన్నాథ్ (గుంటూరు), బొల్లిపల్లి వినూత్న(అనంతపురం), హెచ్ఎస్.భావన(కాకినాడ), శుభమ్ నోఖ్వాల్ (ఎన్‌టిఆర్ జిల్లా) ఉన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ మంచి పాలన అందించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేయాలన్నారు. మంచి పాలనాదక్షులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు.

సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

## కలెక్టర్‌చే వార్డు సచివాలయాల ఆకస్మిక తనిఖీ

### పెన్షన్ల పంపిణీ ఏర్పాట్లపై ఆరా

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ జులై ఒకటో తేదీ నుంచి ఇంటింటికీ అందించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. శనివారం అమీనాపేటలోని శాంతినగర్ 94వ వార్డు సచివాలయం, ఏలూరు రూరల్ మల్కిపురం వార్డు సచివాలయాన్ని ఆమె సందర్శించారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియపై సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు. సచివాలయానికి సంబంధించి సిబ్బంది డ్రా చేసిన పెన్షన్ సొమ్ము, దాని భద్రతపై ఆరా తీశారు. పెన్షన్‌దారులకు సొమ్ము అందజేసిన తర్వాత తీసుకోవాల్సిన రశీదును సీరియల్‌వారీగా కలెక్టర్ పరిశీలించారు. పెన్షన్ పంపిణీకి సంబంధించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆ యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పెన్షన్ సొమ్ముకు సంబంధించి పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చారా లేదా అని అడిగారు. ఎట్టి పరిస్థితుల్లోను జులై ఒకటో తేదీనాడే పెన్షన్‌దారులకు సొమ్ము అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం అమీనాపేటలోని సచివాలయ భవనంలో ఉన్న డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిడిఒ ఎబివివి.లక్ష్మి, రూరల్ ఎంపిడిఒ బి.ప్రణవి, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణాడెల్టా ఆయకట్టుకు నీరివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నినదిస్తున్న రైతులు, నేతలు

జిల్లాలోని కృష్ణా డెల్టా ఆయకట్టులో సార్వా సాగుకు సాగునీరు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం ఏలూరు శివారు సుంకరవారితోట పంట భూముల్లో రైతులు ధర్నా నిర్వహించారు. కృష్ణా డెల్టాకు సాగునీరు అందించాలని నినదించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఖరీఫ్ సాగు సమయం నెల రోజులు దాటిపోయినా, జులై నెల వస్తున్నా కృష్ణా డెల్టా భూములకు సాగునీరు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. నారుమళ్లు వేసుకోవడానికి అవకాశం లేక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీరు విడుదల చేసి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్ని పోతురాజు, బైరెడ్డి లక్ష్మణరావు, అన్నంరెడ్డి రంగారావు, ఆకిరి నాగరాజు, పిట్టా రమణ, తలారి జయరాజు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల మస్తర్లలో తేడాలు రాకూడదు

### డ్వామా అధికారులతో ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు



అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

ఉపాధి హామీ పనుల మస్తర్లల్లో ఎలాంటి అవకతవకలకూ చోటు లేకుండా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఏలూరు జిల్లా డ్వామా పీడీ ఎ.రాము, ఎపీడీ సుధాకర్ శనివారం నారాయణపురంలో ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ధర్మరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ ఉపాధి పనులు, నిధులు, పెండింగు పనులపై చర్చించారు. పని చేసిన వారికే మస్తర్లు వేయాలని, అలసత్వం వహించకుండా ఫీల్ట్ అసిస్టెంట్లు చూడాలని అన్నారు. ఇంతవరకు చేసిన పనులకు పెండింగు బిల్లులపై నివేదిక అందజేయాలని సూచించారు. ఎపిఒ మల్లేశ్వరరావు, సాంకేతిక సహాయకులు ప్రసన్నరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ పోశారావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఎల్‌ఎలు చంటి, ధర్మరాజు

## కలెక్టర్‌ను కలిసిన ఏలూరు, ఉంగుటూరు ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని ఏలూరు, ఉంగుటూరు ఎంఎల్‌ఎలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పత్సమట్ల ధర్మరాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, పూలమొక్క అందజేశారు. కొద్దిసేపు నియోజకవర్గంలో అంశాలపై వారు చర్చించారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - ఏలూరు



డిప్యూటీ సిఇఒకు వినతి అందిస్తున్న నేతలు

జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యాన జెడ్‌పి సిఇఒకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయులకు నాలుగు సంవత్సరాల నుంచి పెండింగులో ఉన్న బ్యాలెన్స్ షీట్లను త్వరితగతిన పూర్తి చేసి అందించాలని కోరారు. ప్రతి పనికీ ఎంత సమయం పడుతుందనేది సిటిజన్ చార్ట్ ద్వారా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పిఎఫ్ రుణాలు, ఫైనల్ పేమెంట్‌కు దరఖాస్తు చేసిన ఉపాధ్యాయులు తమ దరఖాస్తు స్టేటస్ తెలుసుకునేందుకు వింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణా జిల్లా నుండి ఏలూరు జిల్లాలో కలిసిన ఎనిమిది మండలాలకు సంబంధించి పిఎఫ్ వారి అకౌంట్లలో జమ చేయడం లేదని, దానికి సంబంధించి కృష్ణా జిల్లా సిఇఒతో, స్టేట్ సిఎఫ్ఎంఎస్ బాధ్యులతో మాట్లాడాలని కోరారు. రుణాల కోసం దరఖాస్తు చేసిన వెంటనే ఆలస్యం కాకుండా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డిప్యూటీ సిఇఒ స్పందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, బ్యాలెన్స్ షీట్లు వారం, పది రోజుల్లో అందజేస్తామని తెలిపారు. మిగిలిన సమస్యలపై సిఇఒతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి, జిల్లా ఆడిట్ కన్వీనర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

## ఎంట్రీలకు ఆహ్వానం



*ప్రియమైన మిత్రులారా!*

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

**ఎంట్రీలు పంపాల్సిన చిరునామా**

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

## ఆశ.. నిరాశ..!




ఆశ.. నిరాశ.. ఈ రెండూ సగటు మానవుని జీవితంలో అంతర్భాగం. పాలకుల హామీలతో ప్రజలు ఎక్కువ కాలం ఆశలతో జీవించడం, అదే పాలకుల విధానాలతో నిరాశకు గురికావడం పరిపాటైంది. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లాలో ఈ కాలంలో నెలకొంది. 'ప్రతి సోమవారం.. పోలవరం' అంటూ సిఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వచ్చిన సోమవారం చంద్రబాబు పోలవరంలో పర్యటించి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఆనక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మొత్తం ప్రక్రియలో పోలవరం ప్రాజెక్టు పనులపైనే చంద్రబాబు కేంద్రీకరణ ఎక్కువ సాగింది. నిర్వాసితులకు సంబంధించి పరిమితమైన సమీక్ష జరిగింది. ఈ దశలో తాజాగా పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. దీనిలో పోలవరం డ్యామ్ పనులకు సంబంధించి తప్ప నిర్వాసితుల ఊసే లేదు. అంటే గతంలో వలే చంద్రబాబు డ్యామ్ పనులపై పెట్టిన దృష్టి నిర్వాసితులపై పెట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జిల్లాలోని పోలవరం నిర్వాసితుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి. గతంలో జగన్ కూడా అనేక హామీలిచ్చి అధికారంలోకొచ్చాక వారి మాటే వినే ఆలోచనే చేయలేదు. పైగా ఏజెన్సీలో సిఎం పర్యటనకు ముందు కొంతమందికి పరిహారపు సొమ్ము జమ చేయడం, వారినే సిఎం సభకు అనుమతించి మిగిలిన గ్రామాలపై తీవ్ర నిర్బంధం విధించడం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో నిర్వాసితులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాలు చెప్పకనే చెబుతున్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంపై నిర్వాసితులు పెట్టుకున్న ఆశలు ఏ మాత్రం నెరవేరుతాయో వేచిచూడాలి. ప్రస్తుతానికి మాత్రం పోలవరంలో సిఎం చంద్రబాబు పర్యటన, పోలవరంపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా నిర్వాసితుల ప్రస్తావన కనీసంగా లేకపోవడం మాత్రం ముంపు బాధితులను తీవ్ర నిరాశకు గురి చేసిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

దెందులూరు మండలం దోసపాడులో పెద్దల చెరలో ఉన్న అసైన్డ్ భూములను హక్కుదారులకే అప్పగించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన చాలాకాలంగా పోరాటం జరుగుతోంది. కోర్టు తీర్పులను సైతం అధికారులు అమలు చేయని పరిస్థితి ఉంది. వాస్తవ హక్కుదారులను కనీసం భూముల వద్దకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకుని కేసులు బనాయించడం, ఆక్రమణదారులకు రాచమార్గం కల్పించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. 2016లో లోకాయుక్త ఇచ్చిన తీర్పు అమలు చేయాలనేది పేదలు, దళితుల డిమాండ్. నాటి నుంచి ప్రభుత్వ నిర్బంధం, ఆక్రమణదారుల దాడులను ఎదుర్కొంటూనే వారంతా ఐక్యంగా తమ పోరాటం సాగించారు. ఎట్టకేలకు జాయింట్ కలెక్టర్ కోర్టు పేదలకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ భూములు అసైన్డ్‌దారులకే చెందుతాయని స్పష్టం చేసి, అసైన్డ్ హక్కుదారులకు ఆ భూములు అప్పగించాలని ఆదేశించింది. ఇది అపూర్వ విజయం. అక్కడి పేదలు, దళితుల్లో ఆశలు చిగురించాయి. అయితే ఈ ఉత్తర్వులు అధికార యంత్రాంగం ఎప్పటికి అమలు చేస్తుందనే అనుమానమూ వాస్తవ హక్కుదారుల్లో నెలకొంది. వీలైనంత వరకూ జెసి కోర్టు తీర్పును అమలు చేయకుండా జాప్యం చేయడమే అధికారుల తీరులా కన్పిస్తుందనేది వారి వాదన. అదే జరిగితే తాము మరో పోరాటానికి సిద్ధమని పేదలు, దళితులు స్పష్టం చేస్తున్నారు. ఏదైనా పోరాటాల ద్వారానే తమ హక్కులు, ఆస్తులు రక్షించుకోవచ్చని దోసపాడు పేదలు, దళితులు మరోసారి నిరూపించారు.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

## అక్రమ మద్యం, గంజాయి నియంత్రణకు చర్యలు

### కలెక్టర్ కె.వెట్రిసెల్వి

**ప్రజాశక్తి - ఏలూరు**

జిల్లాలో నాటుసారా, గంజాయి నియంత్రణపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచి అటువంటి చర్యలకు పాల్పడేవారిని నియంత్రించాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి సెబ్ అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో సెబ్ జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు, వారి సిబ్బంది జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి సరఫరా, వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి అటువంటి చర్యలకు పాల్పడేవారిని నియంత్రించాలని సూచించారు.

## కోటేశ్వరరావు మృతి తీరనిలోటు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు తమ్మిదిట్టి కోటేశ్వరరావు (85) మృతి చేనేత కార్మిక ఉద్యమానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోటేశ్వరరావు పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలో శనివారం మృతి చెందారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతున్నట్లు చెప్పారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా చేనేత కార్మిక ఉద్యమానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి విశ్వాసంతో పనిచేశారని ఆదిశేషు కొనియాడారు.

## చంద్రపాల్ కుటుంబానికి నష్టపరిహారం అందించాలి

### జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం

**పోలవరం** :విధినిర్వహణలో మృతి చెందిన నరసాపురం రూరల్ కొప్పర్రు గ్రీన్ అంబాసిడర్ చంద్రపాల్ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు బంగారు కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు గ్రీన్ అంబాసిడర్ చంద్రపాల్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. చంద్ర పాల్ కుటుంబానికి ప్రభుత్వం పరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. పంచాయతీ, పారిశుధ్య కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, మృతుని సంతానానికి విద్య మౌళిక వసతులు కల్పించి భార్యకు పెన్షన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారా నాని, బంగారు వెంకటేశ్వరరావు, వారా పోశి, నరేష్, శేషగిరి, మాడుగుల సాయి, సామేలు, రత్నం పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజమార్గం

### రెండో అదనపు జిల్లా జడ్జి మంగకుమారి

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులు తమ డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవచ్చని రెండో అదనపు జిల్లా జడ్జి, అడ్మినిస్ట్రేషన్ జడ్జి పి.మంగకుమారి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం ఏలూరు జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఆమె ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంగకుమారి మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకోసారి జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎ.శ్రీనివాసమూర్తి, అడిషనల్ జడ్జి (సీనియర్ డివిజన్) కెవి.బుల్లి కృష్ణ, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి భార్యకు నష్టపరిహారం కింద నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.37 లక్షల నష్టపరిహారం చెక్కును అడ్మినిస్ట్రేషన్ జడ్జి పి.మంగకుమారి అందించారు.

**భీమడోలు** : రాజీమార్గం ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ సహకరిస్తుందని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి టిఎస్ఎస్.రామతీర్థ రిషిక్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం భీమడోలు కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 35 కేసుల పరిష్కారం జరిగినట్లు కోర్టు అధికారులు తెలిపారు.

## పలు వ్యవస్థల ప్రక్షాళన చేపడతాం

### దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

ప్రభుత్వ వ్యవస్థల్లో కొరవడిన సేవలపై ప్రక్షాళన చేపడతామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చెప్పారు. ఆయనను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, పలు సంస్థల ప్రతినిధులు, ప్రజలు, అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్ఎ చింతమనేని దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**తెలంగాణ తెలుగు మహిళలకు చింతమనేని సత్కారం**

గడచిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దెందులూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని చింతమనేని ప్రభాకర్ గెలుపు కోసం కృషి చేసిన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన తెలంగాణ తెలుగు మహిళా బృందం శనివారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన ఎన్నికల ప్రచారంలో పాల్గొని కృషి చేసిన ఖమ్మం జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు మండవల్లి రజని సహా తెలుగు మహిళా విభాగం నాయకులు కామా అనిత, పల్లూరి రమ్య, మేడిపల్లి రమాదేవి, వెలగపూడి విజయలక్ష్మి తదితర తెలుగు మహిళలకు పసుపు కుంకుమ, చీర పంచెలు అందించి వారిని ఘనంగా సత్కరించారు.

## స్వచ్ఛమైన తాగునీరందించేందుకు చర్యలు

**మండవల్లి** :తాగునీరు కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సర్పంచి మెండ రూబేన్ తెలిపారు. మొదలాయి చెరువు వద్ద ఉన్న సంపులో శనివారం క్లోరినేషన్ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న తరుణంలో తాగునీటి కలుషితమై డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో డయేరియా ప్రబలినట్టు వార్తలు వినిపిస్తున్నాయన్నారు. అందుచేత గ్రామస్తులు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు క్లోరినేషన్ చేసిన నీరును తాగునీటికి వినియోగించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెండ సురేష్ పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం రూ.13 లక్షలు

**ముదినేపల్లి** :మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీలను అధికారులు శనివారం లెక్కించారు. 107 రోజులకు రూ.13,00,795 నగదు, బంగారం ఐదు గ్రాములు, 700 మిల్లీగ్రాములు వెండి ఆదాయం వచ్చినట్లు ఆలయ ఎసి నేల సంధ్య తెలిపారు.

## కోతకు గురవుతున్న రోడ్డు

### భయాందోళనలో వాహనదారులు

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

మండలంలోని కంసాలిగుంట-అక్కుపల్లి గోకవరం దారిలో తారురోడ్డు కోతకు గురవుతోంది. చెరువు వద్ద రోడ్డు మార్జిన్ వెంబడి రోడ్డు కోతకు గురవ్వడంతో వాహనదారుల భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోకుండా మరమ్మతులు చేయించాలని పరిసర ప్రాంత గ్రామస్తులు కోరుతున్నారు. చెరువు వద్ద ఇసుక బస్తాలు, సంచులు అడ్డుగా పెట్టి రోడ్డు కోతను నివారించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కోతకు గురవుతున్న రోడ్డు

## ఆగని శిలాఫలకాల ధ్వంసం

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని గ్రామ సచివాలయాల్లో శిలాఫలకాల ధ్వంసం కొనసాగుతూనే ఉంది. మొన్న మండలంలోని వడాలి గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన విషయం మరువక ముందే మరో మూడు సచివాలయాల శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మండలంలోని పెయ్యేరు, కోడూరు, గ్రామ సచివాలయాల శిలాఫలకాలను, అలాగే ముదినేపల్లి సచివాలయం వద్ద ఉన్న సీసీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కూడా గుర్తు తెలియని వ్యక్తులు సుత్తి, పలుగులతో పగలగొట్టి పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ రీతిన గ్రామ సచివాలయాల శిలాఫలకాలను, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ శిలాఫలకాల ధ్వంసంపై పెయ్యేరు గ్రామ సచివాలయ కార్యదర్శి వై.శ్యాంసుందర్ ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెయ్యేరులో ధ్వంసమైన శిలాఫలకం

# అంకితభావంతో పని చేస్తేనే ప్రజా మన్ననలు

### షంషుద్దీన్ సత్కార సభలో ఎంఎల్ఎ ధర్మరాజు

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

ప్రభుత్వ ఉద్యోగులు తమ తమ శాఖల్లో అంకితభావంతో పనిచేస్తే ప్రజా మన్ననలు జీవితాంతం వెన్నంటే ఉంటాయని ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు అన్నారు. మండల విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్ ఉద్యోగ విరమణ సందర్భంగా నారాయణపురం లయన్స్ క్లబ్‌లో పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు, మండల పరిషత్ ఉద్యోగుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సభకు ఎంపిడిఒ శర్మ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ ధర్మరాజు హాజరై మాట్లాడారు. జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి అనేక పదవుల్లో అందరిని కలుపుకుంటూ పని చేయటం అభినందనీయమన్నారు. అనంతరం షంషుద్దీన్ దంపతులను సత్కరించారు. మండల ప్రత్యేకాధికారి, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు జయలక్ష్మి, కోనసీమ జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు, నారకపురం సర్పంచి అలకనంద, ఎఒ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు జువ్వాది నాగేశ్వరరావు, జివి.గిరి, బివి.రవిచంద్రకుమార్, ఎన్.నాగేంద్ర పాల్గొన్నారు.

షంషుద్దీన్ దంపతులను సత్కరిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

## నారాయణపురం సొసైటీ ప్రత్యేకాధికారిగా మూర్తి

సొసైటీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన మూర్తి

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

సహకార సంఘాలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమిస్తుంది. ఉంగుటూరు మండలంలో చేబ్రోలు విశాల సహకార సంఘం (నారాయణపురం సొసైటీ)కు ప్రత్యేకాధికారిగా ఏలూరు జిల్లా సహకార సంస్థ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కెఎన్.మూర్తిని నియమించింది. ఈ మేరకు ఆయన నారాయణపురం సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఉంగుటూరు మండలంలో అతి పెద్ద సొసైటీ ఇదే. దీని పరిధిలో 25 గ్రామాలకు చెందిన ఆరు వేలకు పైగా రైతులు సభ్యులుగా నమోదై ఉన్నారు. ఏడాదికి రూ.100 నుంచి రూ.120 కోట్ల టర్నోవర్‌తో జిల్లాలో టాప్ టెన్ స్థానాల్లో ఈ సొసైటీ ఆదర్శనీయంగా కొనసాగుతోంది. 2013లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో జనవరిలో సహకార ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అనంతరం అదే ఏడాది 2013 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సొసైటీలకు పాలకవర్గాలు కొలువు తీరాయి. వారి పదవీ కాలం 2018 జనవరితో ముగిసినప్పటికీ 2019 జూలై 30 వరకూ పాత పాలకవర్గానికి అప్పటి టిడిపి ప్రభుత్వం బాధ్యతలు అప్పచెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక 2019 జూలై 31 నుంచి మొన్నటి వరకూ త్రిసభ్య కమిటీలే పాలకవర్గంగా సొసైటీలను నిర్వహించారు. ఎన్నికల జరపకుండా నామినేటెడ్ పదవులతోనే జగన్ ప్రభుత్వంలో కానిచ్చారు. కొత్త ప్రభుత్వం కొలువుతీరి సొసైటీలకు ఎన్నికలు జరపకుండా నామినేటెడ్ పదవులు కట్టబెట్టే అవకాశం ఉందని ఆశావహులంతా ఎదురు చూశారు. ప్రభుత్వం ఇప్పట్లో సొసైటీలకు ఎన్నికలు పెట్టే ఆలోచన లేనివిధంగా ప్రత్యేకాధికారులు నియమించి రైతులకు పంట, పంటేతర రుణాలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పెన్షన్ పంపిణీకి చర్యలు

**ప్రజాశక్తి - మండవల్లి**

లబ్ధిదారులకు ఇంటి వద్దనే పెన్షన్ అందించే విధంగా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని ఎంపిడిఒ బేబీ శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని 6965 మంది పెన్షన్ దారులకు రూ.4,65,89,500 పంపిణీ చేయాల్సి ఉందన్నారు. పెన్షన్ దారులకు ఈ నెల రూ.ఏడు వేల మేర పెన్షన్ అందిస్తున్నామన్నారు.

**పోలవరం** : జూలై ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుంచి అన్ని రకాల పింఛన్లు ఇంటి వద్దనే అందించనున్నట్లు ఎంపిడిఒ జి.శ్రీను తెలిపారు.

## 4న నూజివీడు మార్కెట్ యార్డులో సమావేశం

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

నూజివీడు పరిసర ప్రాంతాల్లో రైతులకు, వ్యాపారులకు ఉపయోగపడే విధంగా మామిడిమార్కెట్ ఏర్పాటు, మామిడి ఎగుమతులకు ఉన్న అవకాశాలను చర్చించేందుకు జులై నాలుగో తేదీ గురువారం నూజివీడు మార్కెట్ యార్డులో సమావేశం నిర్వహించనున్నట్లు నూజివీడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యదర్శి శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూజివీడు మార్కెట్ యార్డ్‌లో మంత్రి కొలుసు పార్థసారధి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

### మంత్రి కొలుసు పార్థసారధి

**ఆగిరిపల్లి** :బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి హామీ ఇచ్చారు. మండల పరిధిలోని శోభనాపురం గ్రామంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన వెలుగు సిసి చక్కిరాల కొండలు కుటుంబాన్ని, ఈదర గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన దొండపాటి నాగరత్నం, రామదాసు కుటుంబాన్ని, ఈదులగూడెం గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన పండిబోయిన నాగేశ్వరరావు, ట్రాక్టర్ కింద పడి చనిపోయిన ఈడే నాగేంద్రరావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ శాఖ ఎస్ఇ, డిఆర్‌డిఎ పీడీలతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబాలకు వచ్చే ఇన్సూరెన్స్ తక్షణమే వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## 4న సూర్యావతి వర్ధంతి సభ

**జీలుగుమిల్లి** :అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో జీలుగుమిల్లి మండల కమిటీ సమావేశం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం నిర్వహించినట్లు ఎన్.నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సంఘం జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరారు. మహిళా సమస్యలపై అనేక పోరాటాలు చేసిన మానుకొండ సూర్యావతి వర్ధంతి సభ ఈ నెల నాలుగో తేదీన నిర్వహిస్తున్నారని, మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెల్లం రాజమ్మ, తెల్లం జ్యోతి మేరి, సావిత్రి పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందినవారికి సత్కారం

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

ఉద్యోగ విరమణ చేసినవారు తమ ఉద్యోగ సమయంలో నిర్వర్తించిన విధులను, వారు చూపిన ధైర్య సాహసాలను మిగిలిన పోలీస్ సిబ్బంది ఆదర్శంగా తీసుకుని విధులు నిర్వహించాలని ఎస్‌పి మేరీ ప్రశాంతి సూచించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ విరమణ చేస్తున్న నలుగురు ఎస్ఐలు, నలుగురు ఎఎస్ఐలు, ఒక హెడ్ కానిస్టేబుల్‌లకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎస్‌పి మేరీప్రశాంతి హాజరై వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు శాఖ నుంచి వారికి రావాల్సిన సొమ్మును సకాలంలో అందేలా చూస్తామని చెప్పారు.

**కామవరపుకోట** :ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతగా పని చేయాలని ఎంఇఒ-2 ప్రశాంత్ కుమార్ అన్నారు. ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రమాసుందరికి స్థానిక హైస్కూల్లో తోటి ఉపాధ్యాయులు, స్థానిక పెద్దల ఆధ్వర్యంలో శనివారం సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 ప్రశాంత్ కుమార్, అనంతరం రమాసుందరి మాట్లాడారు. రమాసుందరిని పలువురు సత్కరించారు.

**ముదినేపల్లి** : అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు గౌరవం లభిస్తుందని ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అన్నారు. ముదినేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న యామల ప్రకాష్‌రావు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన సభలో పలువురు ప్రకాష్ రావు సేవలను కొనియాడారు.

## విద్యార్థులకు పుస్తకాలు అందజేత

**ప్రజాశక్తి - కుక్కునూరు**

మండల కేంద్రమైన కుక్కునూరు జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా కిట్లను టిడిపి మండలాధ్యక్షులు మొలిశెట్టి నాగేశ్వరరావు, జనసేన అధ్యక్షులు మొలిశెట్టి గంధర్, బిజెపి అధ్యక్షులు తూము వెంకన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్య కమిటీ వైస్ ఛైర్మన్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు నాగు మాట్లాడారు. ఈ విద్య సంవత్సరం చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పాఠశాలలో క్లాస్ ఫస్ట్ వచ్చినవారికి రూ.1,0116, సెకండ్ వచ్చిన వారికి రూ.5116 ఇస్తానని ప్రకటించారు.

**మండవల్లి** :దాతలు అందిస్తున్న సహాయాన్ని అందిపుచ్చుకుని విద్యలో రాణించి భావిభారత పౌరులుగా ఎదగాలని సజ్జ సురేష్‌బాబు(బాబి) అన్నారు. మండవల్లి ప్రాథమిక పాఠశాల1,2 లోని విద్యార్థులకు నల్లమోతు పాండురంగారావు ఆర్థిక సాయంతో నిర్వహించిన నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం చిన్నారులు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి.

**టి.నరసాపురం** :విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ జయ్యవరపు శ్రీ రామమూర్తి తెలిపారు. మండలంలోని కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లు పంపిణీ చేశారు.

**కామవరపుకోట:**మండలంలోని రామన్నపాలెం లోని ఎంపిపి స్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన బుక్స్, బ్యాగ్‌లను స్కూల్ ఆవరణలో పంపిణీ చేశారు.

## త్వరలో మండల స్థాయి ఆటల పోటీలు

**ప్రజాశక్తి - ముసునూరు**

నూజివీడులో సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు హేమలత తెలిపారు. ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి, నూజివీడు మండల వ్యాయామ ఉపాధ్యాయులు సమావేశం శనివారం నిర్వహించారు. మండల స్థాయి ఆటల పోటీల వేదికలను ఆయా మండల పరిధిలో బాలుర ఆటల పోటీల వేదికలను నిర్ణయించారు. ముసునూరు మండల స్థాయి ఆటల పోటీలు ముసునూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో, ఆగిరిపల్లి మండల స్థాయి ఆటల పోటీలు ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, నూజివీడు మండల స్థాయి ఆటల పోటీలు ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, చాట్రాయి మండల స్థాయి ఆటల పోటీలు మర్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏ రోజు నుంచి ఈ ఆటల పోటీలు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ప్రజాశక్తి - ముసునూరు**

మన భూమి - మన భవిస్యత్ అనే అంశంతో భవిష్యత్ తరాల వారికి ప్రతిఒక్కకరూ అండగా ఒక మొక్కను నాటాలని ప్రేరణాలయ డెవలప్‌మెం ట్ సిస్టర్స్ సుధారాణి పేర్కొన్నారు. శనివారం తమ ప్రేరణాలయ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ ఏడాది 109 మామడి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడంతో పాటు, ఆ మొక్క రెండేళ్ల పాటు సంరక్షణ భాధ్యత కూడా తమరే తీసుకుంటున్నట్లు తెలిపారు. కలుషిత వాతావరణాన్ని కాపాడుకునేందుకు భవిష్యత్తులో సుమారు 1500 మొక్కలు నాటేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి ఒక్క మనిషి ఆనందంగా, ఆరోగ్యకరంగా జీవించడానికి ప్రకృతి వ్యవసాయం సాగు చేసుకోవాలన్నారు.

## అనుమతుల్లేకుండా పాఠశాలలు నిర్వహించొద్దు

**కామవరపుకోట** :ప్రభుత్వ అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుని తరగతులు నిర్వహిస్తున్న కామవరపుకోటలోని చెక్ పోస్ట్ సెంటర్ సమీపంలోని తపస్య పాఠశాలను ఎంఇఒ-1 డి.సుబ్బరావు, ఎంఇఒ-2 సిహెచ్.ప్రశాంత్ కుమార్ శని వారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు, అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహించరాదన్నారు.

## మెడికల్ షాపుల్లో తనిఖీలు

**చింతలపూడి** :ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ ఆలి షేక్ అన్నారు. మండలంలోని పలు మెడికల్ షాపుల్లో ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. చింతలపూడి నిషిత, వరలక్ష్మి మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించగా కాల పరిమితి అయిన మందులను గుర్తించారు. దీనిపై సమగ్ర రిపోర్టు తయారుచేసి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
నూజివీడు, జంగారెడ్డిగూడెం, కైకలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం అర్బన్
రూరల్ కేంద్రాలు: దెందులూరు, పెదవేగి, విజయరాయి, ఏలూరు, పెదపాడు, నిడమర్రు, లింగపాలెం, వేలేరుపాడు, తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, అత్తిలి, ఇరగవరం, నరసాపురం, భీమవరం, ఆకివీడు, మొగల్తూరు
ఇంటర్వ్యూ : తేది: 01-07-24 సోమవారం ఉదయం 9.30 గంటల నుండి
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశం: ప్రజాశక్తి కార్యాలయం, బొలుసువారివీధి, పవర్‌పేట, ఏలూరు
ఫోన్ నెం : 99493 66196, 89191 70815, 94900 99168, 94900 99190



ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
సుదీర్ఘ విధి నిర్వహణ అనంతరం మా 'శ్రీను' గ్రేడ్-1 కార్యదర్శిగా పదవీ విరమణ చేయుచున్న తరుణాన శుభాకాంక్షలందిస్తూ... ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో ఆనందమయం కావాలని ఆశిస్తూ...
శ్రీమతి & శ్రీ పొట్లచెర్వు శ్రీనివాస్, పద్మావతి
గ్రేడ్-1 పంచాయతి కార్యదర్శి, చెరుకుమిల్లి, ప.గో.జిల్లా
తల్లి: లింగవర్ధని, వదిన: గాయత్రి
బావగారు-అక్క: పండితారాధ్యుల శ్రీ సత్య సూర్యప్రసాద్, రిటైర్డ్ టీచర్ - సత్య మాణిక్యాంబ (లేటు)
తమ్ముడు-మరదలు: రాధాకృష్ణ, ఉండ్రాజవరం మండల బ్రాహ్మణ యువజన కన్వీనర్ - పి.ఎస్.కె.రాణి
తమ్ముని కుమారుడు-కుమార్తె: శ్రీకరప్రసాద్, మాస్ మ్యూచువల్ ఫండ్స్, హైదరాబాద్ ప్రియాంక
మరియు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తాడిపర్రు

## మద్ది ఆంజనేయస్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్**

మండలంలోని గురవాయిగూడెంలో మంది ఆంజనేయస్వామిని రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మండపంపై వారికి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదములు అందించారు.

## పునరావాస కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి - పోలవరం**

మండలంలోని కొండ్రుకోట పునరావాస కాలనీలో శనివారం ఎల్ఎన్‌డి.పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.నిఖిల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసన్ అండర్ ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కెవివి.విజయకుమార్ నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాల 150 మందికి వైద్య సేవలందించి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిప్యూటీ మలేరియా నివారణ అధికారి సురేష్ పాల్గొన్నారు.

## శ్రీవారి సన్నిధిలో మళ్ళీడి బాబి

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**

ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని జనసేన పార్టీ ప్రొటోకాల్ ఛైర్మన్ మళ్ళీడి తిరుమలరావు (బాబి) శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు వేద పండితులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## గ్రామసభల నిర్వహణపై అవగాహన

**ప్రజాశక్తి - మండవల్లి**

ఓటర్లంతా గ్రామ సభలకు హాజరై భాగస్వాములై పర్యవేక్షించడం, నిర్ణయాలు తీసుకోవడం ద్వారా మాత్రమే గ్రామాభివృద్ధి ప్రగతి సాధ్యపడుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ సభ్యులు భాస్కరరావు, అప్పారావు స్పష్టం చేశారు. మండలంలోని గన్నవరం గ్రామస్తులకు గ్రామసభల నిర్వహణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వికేంద్రీకృత ప్రజాస్వామ్య వ్యవస్థకు గ్రామసభ పునాది వంటిదన్నారు. ప్రజలు చైతన్యవంతులై గ్రామ సభల్లో పాల్గొని ప్రశ్నించినప్పుడే గ్రామాభివృద్ధి ప్రజాస్వామ్యం అమలవుతుందన్నారు.

## డ్రెయిన్ల పూడికతీత

**ప్రజాశక్తి - చింతలపూడి**

గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల డ్రెయిన్లు పూడికపోయి అధిక వర్షాలు వచ్చినప్పుడు వర్షపు నీరు వెళ్లేందుకు సరైన మార్గాలు లేకపోవడంతో టౌన్ అంతా నీరు చుట్టుముట్టేస్తుందని, డ్రెయిన్లలోని మట్టిని తీసి షాపుల యాజమాన్యానికి ఇబ్బంది లేకుండా శానిటేషన్ చేసి వర్షపు నీరు పోయేలా చర్యలు తీసుకుంటామని టిడిపి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అన్నారు. ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం చింతలపూడి నగర పంచాయతీలోని వర్షపు నీరు పోవడానికి, అదేవిధంగా డ్రెయిన్ల పూడిక గురించి నగర పంచాయతీ కమిషనర్ రాజుతో కలిసి సమస్యాత్మక ప్రదేశాలను పరిశీలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి పట్టణ ప్రజలకు ఇబ్బంది లేకుండా వర్షపు నీరు చెరువుల్లోకి పోయేలా కాలువలు తీయించాలని ఎంఎల్ఎ రోషన్‌కుమార్ ఆదేశాలు ఇచ్చారన్నారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు

**చింతలపూడి**: విద్యార్థులందరూ ఆరోగ్యకరంగా ఉండాలని ఎంపిపి రాంబాబు అన్నారు. చింతలపూడి టౌన్ ఎస్‌బిఐ నగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు చేసి పేస్ట్, బ్రష్, అవసరమైనవారికి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రత పాటించా లన్నారు.

## సమస్యలపై ఎంఎల్ఎ స్పందన

**చింతలపూడి** :ప్రజా సమస్యలపై చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ వెంటనే స్పందించటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని కొప్పులవారి వీధిలోకి తాగునీటి నిమిత్తం రెండు బోర్లు ఉండగా, ఒక తాగునీటి మోటార్ దగ్గర ఉన్న కేబుల్ వైరును చోరులు అపహరించుకుపోయారు. రెండో తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్ ఆదేశాల మేరకు మరమ్మతులు చేపట్టారు. కేబుల్ వైర్ కూడా బిగిస్తున్నారు. పనులు వెంటనే జరగటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

**హెచ్.ఎమ్.ఓ.పి. నెం. 211/2023**

బిట్వీన్:

సుంకరి (అనే) గోపవరపు వెంకటలక్ష్మి, భర్త: సుంకరి భానుచందర్, హిందూ, స్త్రీ, వయస్సు 32 సం॥లు, డోర్ నెం. 5-9, నల్లజర్ల గ్రామం, నల్లజర్ల మండలం, తూ॥గో॥జిల్లా, టిపిజి/ఎస్‌సిజె. **-పిటీషనర్**

మరియు

సుంకరి భానుచందర్, S/o. చంద్రశేఖర్‌రావు, హిందూ, పురుషుడు, 35 సం॥లు, డిప్పకాయలపాడు గ్రామం, కొయ్యలగూడెం మండలం, తూర్పుగోదావరి జిల్లా, టిపిజి/ఎస్‌సిజె **-రెస్పాండెంటు**

పై నెంబరు గ్రంధములో పిటీషనర్ గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికి మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 10-07-2024వ తేదీ బుధవారం నాటికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తాడేపల్లిగూడెం **జి.వి.ద్వారకానాథ్**
తేది:29-6-2024 పిటీషనర్ తరపు న్యాయవాది